క్లుప్తంగా

రూ.1,15,44,257 కోట్ల వైఎస్సార్ సున్నావడ్డీ లబ్ధి

దాచేపల్లి : డ్వాక్రా గ్రూప్‌లకు రూ. 1,15,44,257 కోట్ల వైఎస్సార్ సున్నావడ్డీ ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఏపీఎం కె. మంత్రునాయక్ మంగళవారం తెలిపారు. రూరల్ మండల పరిధిలోని 802 డ్వాక్రా గ్రూప్‌లలోని 8048 మంది మహిళలకు ఈ మేర లబ్ధి జరుగుతుందని ఆయన చెప్పారు. మండలంలోని భట్రుపాలెంలో 52 గ్రూప్‌లకు రూ. 6,20,160, గామాలపాడులో 99 గ్రూప్‌లకు రూ. 15,18,478, రామాపురం 112 గ్రూప్‌లకు రూ. 17,15,799, పొందుగల 55 గ్రూప్‌లకు రూ. 8,90,455, ముత్యాలంపాడు 85 గ్రూప్‌లకు రూ. 14,17,367, తంగెడ 112 గ్రూప్‌లకు రూ. 17,08,235, పెదగార్లపాడు 73 గ్రూప్‌లకు రూ. 8,83,040, కేసానుపల్లి 103 గ్రూప్‌లకు రూ. 13,83,619, మాదినపాడు 111గ్రూప్‌లకు రూ. 14,07,096 చొప్పున సున్నా వడ్డీని డ్వాక్రా గ్రూప్‌ల్లో ప్రభుత్వం జమ చేస్తోందని ఆయన వెల్లడించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందని ఆయన తెలిపారు.

జీడీసీఎంఎస్ డైరెక్టర్‌గా విజయభాస్కరరెడ్డి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(జీడీసీఎంఎస్) పాలకవర్గ సభ్యుడిగా మాచర్ల మండలం, కంభంపాడు గ్రామానికి చెందిన ఆరికట్ల విజయభాస్కరరెడ్డి ఇటీవల నియమితులై బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా నియమితులైన విజయభాస్కరరెడ్డి మంగళవారం జీడీసీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మిని గుంటూరు కన్నావారితోటలోని జీడీసీఎంఎస్ ప్రధాన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతనంగా పాలకవర్గ సభ్యులుగా నియమితులైన విజయభాస్కరరెడ్డిను మిగిలిన పాలకవర్గ సభ్యులకు పరిచయం చేశారు. ఇదే క్రమంలో గత రెండు సంవత్సరాలుగా పాలకవర్గ సభ్యుడిగా సేవలందించిన మద్దిరాల కృష్ణారెడ్డిని పాలకవర్గ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, జీడీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం, కార్యాలయం మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అతివేగం ప్రమాదానికి దారి తీస్తోంది

ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్

పిడుగురాళ్ల: వర్షాకాలంలో అతివేగం ప్రమాదానికి దారి తీస్తోందని ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ అన్నారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో హైవే రోడ్లపై హైడ్రోప్లానింగ్ ఏర్పడి ప్రమాదాలకు కారణమవుతుందని, దానిని గమనించి ప్రతి ఒక్కరు తక్కువ వేగంతో వాహనాలను నడిపితే బాగుంటుందని ఆయన ప్రయాణికులకు సూచించారు. అంతేకాకుండా రహదారి వెంట భద్రత సూత్రాలను తప్పనిసరిగా పాటించాలన్నారు.

సాగర్ జలాలతో మంచినీటి చెరువులు నింపాలి

శావల్యాపురం: సాగర్ జలాలతో మండలంలోని అన్నీ గ్రామ పంచాయతీల్లో మంచినీటి చెరువు లు, కుంటలు, వాగులు నింపాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ సాగర్ జలాలు తాగునీటి అవసరాల నిమిత్తం ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాల మేరకు సాగర్ జలాలు విడుదల అవడంతో మండల కేంద్రం శావల్యాపురంలో మంచినీటి చెరువులోని తాగునీరు అయిల్ ఇంజిన్లు ద్వారాబయటకు పంపుతున్నామన్నారు. గ్రామంలోకి తాగునీరు వారం రోజుల వరకు సరఫరా నిలుపుదల చేస్తామని, తదుపరి చెరువులో పేరుకుపోయిన మట్టిపూడికను తీసేసి, చెరువును బ్లీచింగ్‌తో శుద్ధిచేసి సాగర్ జలాలను నింపుతామన్నారు.అలాగే పంచాయతీ నిధులు రూ. లక్ష రూపాయల వ్యయంతో రెండు విద్యుత్ మోటా ర్లు నూతనంగా ఏర్పాటు చేసి చిన్నపాటి మరమ్మతులను పూర్తిస్థాయిలో పారదర్శకంగా జరిగేలా క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తామన్నారు. అనంతరం శావల్యాపురం గ్రామంలోకి తాగునీరు విడుదల చేస్తామన్నారు. ఆయనతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మూఢవత్ ఆకాష్, పంచాయతీ కార్యదర్శి కనుగంటి మహేంద్ర ఉన్నారు.

పాఠశాలకు పుస్తకాలు వితరణ

రొంపిచర్ల: మండలంలోని బుచ్చిపాపన్నపాలెం గ్రామంలో గల జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ఆ గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ గానుగపంట వెంకటేశ్వరరెడ్డి రూ.50 వేల రూపాయల విలువచేసే ఇంగ్లీష్ స్టోరీ బుక్స్ ఫర్ లైబ్రరీ పుస్తకాలను మంగళవారం అందజేశారు. ఈ పుస్తకాలను వెంకటేశ్వరరెడ్డి అందించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన కోర్సులకు అనుగుణంగా స్పోకెన్ ఇంగ్లిషులో విద్యార్థులకు ఈ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఆయా తరగతులకు అనుగుణంగా పుస్తకాలను గ్రేడింగ్ చేసి ట్రంక్ పెట్టెల్లో భద్రపరిచి అందించారు.గతంలో కూడా ఈ దంపతులు పాఠశాలకు రూ.40 వేల రూపాయల విలువచేసే లైబ్రరీ బుక్స్‌ను అందజేశారు. మరోసారి స్టోరీ బుక్స్‌ను అందించి విద్య పట్ల, ప్రభుత్వ పాఠశాల పట్ల వారికున్న మక్కువను తెలియజేసుకున్నారు. వెంకటేశ్వరరెడ్డి పాఠశాల విద్యను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నారని వక్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఉపాధ్యాయులు కోటేశ్వరమ్మ, పలువురు ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



మహిళకు ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని వివరిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: ఎస్సీ, ఎస్టీ ఇతర పేద వర్గాల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న కృషిని గమనించి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, రాష్ట్ర చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి పేద వర్గాలను ఆదుకుంటున్న ఘనత జగనన్న ప్రభుత్వానిదేనని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) స్పష్టం చేశారు. మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామ శివారు సింగరుట్ల తండా, ఎస్సీ కాలనీలలో మంగళవారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పీఆర్కే జోరు వానలో సైతం నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే పీఆర్కేకు సింగరుట్ల వాసులు బాణా సంచాపేల్చి ఘన స్వాగతం పలికారు. ముందుగా తండాలోని రాములవారి గుడిలో సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తండాలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఇప్పటి వరకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వారికి గుర్తు చేశారు. పథకాలు ఎలా ఉన్నాయని ప్రజల స్పందనను అడిగి తెలుసుకున్నారు. గిరిజనుల బాగు కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే పీఆర్కేను ప్రజలు ఆశీర్వదించారు. తమ ఇంటికి ఎమ్మెల్యే వచ్చి బాగోగులు తెలుసుకోవడం పట్ల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇది పేదల అభ్యున్నతి కోసం పాటుపడుతున్న ప్రభుత్వమని మీ ఆశీర్వాదం ఉంటే భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసే సత్తా జగనన్న ప్రభుత్వానికి ఉందన్నారు. ఈ సంక్షేమం అభివృద్ధి ఇలాగే కొనసాగేందుకు జగనన్నకు మద్దతుగా నిలవాలని ప్రజలకు ఎమ్మెల్యే పీఆర్కే విజ్ఞప్తి చేశారు. గ్రామ సర్పంచ్ జవ్వాజీ నాగేంద్రం, ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, తండా, కాలనీ పార్టీ నాయకులు రామావతు హనుమానాయక్, బాలకృష్ణానాయక్, సోమ్లానాయక్, నానూనాయక్, బాణావతు బుడ్డానాయక్, మామిడి శేఖర్, మామిడి అన్నారావు, ఎంపీటీసీ గాడిపర్తి రమాదేవిపూర్ణయ్య, మాజీ సర్పంచ్‌లు ఉన్నం ఆదిశేషగిరిరావు, నర్సింగ నాగేశ్వరరావు, గ్రామ పార్టీ నాయకులు మాచర్ల ఏడుకొండలు, వాల్మీకి నరేంద్ర, మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు. సీఐ జయకుమార్, ఎస్ఐ రామాంజనేయులు, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో అధికారులు క్షేత్రస్థాయి సిబ్బంది కార్యక్రమ నిర్వహణలో పాల్గొన్నారు. ఒక పక్క వర్షం పడుతున్నా ఎమ్మెల్యే పీఆర్కే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. అలాగే పార్టీ నాయకులు కార్యకర్తలు కూడా గొడుగుల సాయంతో పీఆర్కే వెంట నడిచారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శనీయం



నూతన వలంటీర్లకు నియామకపు పత్రాన్ని అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పిడుగురాళ్ల: వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శనీయమని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. మండలంలోని కరాలపాడు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సచివాలయాలకు వలంటీర్లను బుధవారం నియమించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ...రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ, సచివాలయ వ్యవస్థను తీసుకొని వచ్చి దేశం మొత్తం రాష్టం వైపు చూసే వింగాను చేశారని వారు తెలియజేశారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ కన్వీనర్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ చల్లా శివారెడ్డి, ఎంపీటీసీ అనబోతుల గురవారెడ్డి, ముడేల శ్రీనివాస్‌రెడ్డి, చల్లా కోటిరెడ్డి, మాజీ సర్పంచ్ కాపర్తి వెంకటేశ్వర్లు, పంచాయతీ సెక్రటరీ శ్రీనివసారావు తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య పరిరక్షణపై కమిషనర్ సమీక్ష



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఈవి రమణబాబు

మాచర్ల: పట్టణంలో వర్షాలు భారీగా కురుస్తున్నాయి. జాగ్రత్త వహించండి. ఎక్కడా రాజీపడకుండా, అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉంది. ప్రతి పారిశుద్ధ్య కార్మికుడు అప్రమత్తంగా ఉండి పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ ఈవి రమణబాబు సిబ్బందికి సూచించారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శానిటరీ కార్యదర్శులు, సూపర్‌వైజర్లు, వర్కర్లతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. వర్షాల వల్ల దోమలు పెరుగుతాయని, రోడ్ల పై మురుగునీరు పెరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజూ కాల్వలలో వీధులను శుభ్రం చేయడంతో పాటు ఆయా ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విధుల విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని, ప్రతి పారిశుద్ధ్య కార్మికుడు విశేష కృషి చేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ రాజా, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షలో సర్టిఫికెట్లు అందజేత



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న పార్టీ నేతలు

పిడుగురాళ్లరూరల్: జగనన్న సురక్ష ద్వారా ఎంతో లబ్ధి చేకూరుతుందని మాజీ జెడ్పీటీసీ వీరభద్రుని రామిరెడ్డి అన్నారు. మండలంలోని కోనంకి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ జెడ్పీటీసీ వీరభద్రునిరామిరెడ్డి మాట్లాడుతూ గత జన్మభూమి కమిటీలాగ కాకుండా వలంటీర్ వ్యవస్థ ద్వారా నేరుగానే ప్రజలకు లబ్ధి చేకూరుతుందని ఆయన తెలియజేశారు. జగనన్న సురక్ష ద్వారా 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేయడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. అర్హులై ఏమైనా సంక్షేమ పథకాలు రాకపోతే వెంటనే పరిష్కరించడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసీలారద చక్రవర్తి, ఎంపీడీఓ కాశయ్య, ఏజేసీ కన్వీనర్‌భూమిరెడ్డి యల్లారెడ్డి, సర్పంచ్ శేసయ్య, ఎంపీటీసీ మందా సుగంధ, ఈఓపీఆర్‌డీ శంకర్రావు, ఏపీఓ మేరిగ్రేస్, సర్వేయర్ శ్రీనివాస, ఆర్ఐ శ్రీనివసరావు, సచివాలయ సిబ్బంది, గృహసారధులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు రెంటచింతలలో జగనన్న సురక్ష

రెంటచింతల: రాష్ట్రంలోని ప్రతి గడపలో ఉన్న అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందించి, ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం బుధవారం రెంటచింతల గ్రామంలోని సచివాలయం–111లో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ యల్లా మహాలక్ష్మి మంగళవారం తెలిపారు. తహసీల్దార్ కె.పుల్లారావు, ఈఓపీఆర్డీ సీహెచ్ రామచంద్రావు, డిప్యూటీ తహసీల్దార్ జే.రాజారావు, ఆర్‌డబ్ల్యుస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి ఈ జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని సంక్షేమపథకాలు అందని అర్హులైన వారికి పథకాలను అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించి వారికి ధృవీకరణ పత్రాలను అందజేయడం జరుగుతుందన్నారు. గ్రామంలోని సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అందరూ తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో పాల్గొని అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

మణిపూర్ ఘటనలో నిందితులను శిక్షించాలి



మణిపూర్ ఘటనను నిరసిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

పిడుగురాళ్ల: మణిపూర్ ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి సీఐటీయూ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలో ఆర్ అండ్‌బి బంగ్లా నుంచి పోలీస్‌స్టేషన్ నుంచి హైస్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ...మే నెల నాలుగో తేదీన ఇద్దరు గిరిజన మహిళలపై దాడులు చేసిన వారిని, ఈ ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే శిక్షించాలని, దానికి బాధ్యత వహిస్తూ మణిపూర్ ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత 80 రోజులుగా మణిపూర్ రావణ కాష్టం జరుగుతా ఉంటే కేంద్రంలోని నరేంద్రమోడీ, అమిత్‌షా చోద్యం చూస్తున్నారన్నారు. బీజేపీ మతోన్మాదానికి రెచ్చగొడుతూ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తోందని ఈ ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని లేని పక్షంలో ప్రజా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు తమ్మిశెట్టి పద్మ, మార్తమ్మ, కృష్ణవేణి, అనంతరాములు, కొదమల అరుణ్‌కుమారి, మాధగాని కోటేశ్వరమ్మ, చెల్లా పద్మా, దేవళ్ల వెంకటేశ్వర్లు, బి. రామారావు, వెంకట్రావు, బత్తుల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనను ఖండిస్తూ నిరసన

పిడుగురాళ్ల: మణిపూర్‌లో గిరిజన మహిళలపై జరుగుతున్న మారణకాండ, అత్యాచారలకు నిరసనగా బుధవారం నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు. జమాతే ఇస్లామి హింద్, ముస్లిం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ ర్యాలీ ఉదయం 10.30 గంటలకు నిర్వహించడం జరుగుతుందని పిల్లుట్ల రోడ్ షాదిఖానా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనవచ్చునని వారు తెలియజేశారు.

బీఎల్‌ఓల పనితీరును పరిశీలించిన కమిషనర్



మాచర్ల: పురపాలక సంఘ పరిధిలోని పలు వార్డుల్లో బూత్ లెవల్ అధికారులు (బిఎల్‌ఓ) నిర్వహిస్తున్న సర్వేను మున్సిపల్ కమిషనర్ ఈవి రమణబాబు తనిఖీ చేశారు. మంగళవారం పట్టణంలోని 61,65,80, 85,90 బూత్‌లలో కమిషనర్ ఆకస్మికంగా తనిఖీలు జరిపారు. ఏ విధంగా బూత్ లెవల్ అధికారులు పరిశీలన జరిపారు. ప్రతి వార్డులో అవగాహన కల్పించాలని తెలిపారు. ఎక్కడా వలంటీర్ పాల్గొనకుండా చూసుకోవాలని, అలా వలంటీర్ పాల్గొంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అసిస్టెంట్ ఎలక్టరోల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్న కమిషనర్ మూడు గంటల పాటు ప్రతి ఇంటికి బీఎల్‌ఓలు నిర్వహిస్తున్నారో పరిశీలన జరిపారు. ఆయన మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మండల వ్యాప్తంగా చురుగ్గా సమగ్ర ఓటర్ల సర్వే

దుర్గి: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఇంటింటికీ బూత్ లెవల్ ఆఫీసర్లు (బిఎల్‌ఓ) సమగ్ర ఓటర్ల సర్వేను కొనసాగిస్తున్నారు. ఈ నెల 21 నుంచి ప్రారంభమైన ఓటర్ల సర్వేకు స్థానిక బీఎల్‌ఓలకు తహసీల్దార్ ఎం రమేష్‌కుమార్ సమావేశానికి అధ్యక్షత వహించి తగిన అవగాహన సదస్సు నిర్వహించి శిక్షణ నిచ్చారు. ఈ సందర్భంగా ప్రతి బీఎల్‌ఓ క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల లిస్టు ఆధారంగా క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. తహసీల్దార్ ఎం రమేష్‌కుమార్ మాట్లాడుతూ 01-01-2024 నాటికి 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. చనిపోయిన వారి ఓట్లు తొలగింపు, ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీలు, నకిలీ ఓట్లను గుర్తించడం తదితర విషయాల్లో పలు సూచనలు చేశారు. గుర్తింపు కార్డులలో తప్పుల సవరణ, స్పష్టత లేని ఫొటోలు తొలగించి మంచి ఫొటోలను ఓటర్లు బీఎల్‌ఓలకు అందజేయాలని కోరారు. నియోజక వర్గం మారినా, ఓటర్ జాబితాలో పేరు లేకపోయినా తప్పులున్నా సరిచేసుకునే అవకాశముందన్నారు. దీర్ఘకాలికంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను వారి అభీష్టం మేరకు ఏ ప్రాంతంలో ఉంచాలో అక్కడ జాబితాలో ఉంచటం జరుగుతుందన్నారు. వందేళ్ళు పై బడిన వారిని ప్రత్యేకంగా గుర్తిస్తామన్నారు. ఒక బూత్‌లో సరాసరి 1500ల ఓట్లు పైన ఉంటే మరో బూత్‌కు మార్పు చేయటం జరుగుతుందన్నారు. వచ్చే నెల 21వ తేది వరకు ఈ సర్వే కొనసాగుతుందన్నారు. బీఎల్‌ఓలకు ఆయా రాజకీయ పార్టీల నేతలు, ఓటర్లు సమగ్ర సర్వేకు సహకరించాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి

రెంటచింతల: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు మలేరియా, టైఫాయిడ్ వచ్చే ప్రమాదం పొంచి ఉందని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లు అయితే మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాల నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చన్నారు. దోమ కాటు ద్వారా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, బోధకాలు వంటి వ్యాధుల వ్యాపించే అవకాశం ఉందని వివరించారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా తప్పనిసరిగా పాటించాలన్నారు. దోమతెరలు వాడాలని, ఇంటి కిటికీలకు మెష్‌లను వాడాలని, జ్వరం వచ్చిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని, ఇంటిలో, వెలుపల చెత్తను తొలిగించాలని, పరిసరప్రాంతాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, వారానికి ఒక్కసారి నీటి తొట్లను ఖాళీ చేసి మరుసటి రోజున నీటితో నింపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆరోగ్య పర్యవేక్షకులు చెన్నంశెట్టి అంకమ్మరావు, సీహెచ్‌ఓ పూజల నాగేశ్వరరావు తదితరులున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



మృతి చెందిన తమ్మిశెట్టి పెద్దిరాజు

రొంపిచర్ల : గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన హైవే రోడ్డు పరిధిలో గల మండలంలో సంతగుడిపాడు గ్రామంలో మంగళవారం జరిగింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సంతగుడిపాడు గ్రామానికి చెందిన తమ్మిశెట్టి పెద్దిరాజు(19) మండలంలోని విప్పర్ల గ్రామం నుండి సంతగుడిపాడు గ్రామానికి బైక్ మీద వస్తున్నారు. ఇదే క్రమంలో సంతగుడిపాడు గ్రామంలో గల పరగటిచర్ల అడ్డరోడ్డు వద్దకు రాగా వెనుక వైపు నుంచి వేగంగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనటంతో బైక్ మీద నుండి కిందపడి తీవ్ర గాయాలు పాలైన పెద్దిరాజు అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటన జరిగిన వెంటనే గ్రామస్తులు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సంఘటన జరిగిన తీరును అక్కడ ఉన్నవారిని అడిగి తెలుసుకున్నారు. మృతుడి తల్లిదండ్రులు, బంధువులు అక్కడికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్ సురేష్ బాబు తెలిపారు.

పట్టణంలో జోరు వర్షం



పట్టణంలో జోరుగా పడుతున్న వర్షం

మాచర్ల: పట్టణంలో 24గం''లుగా జోరుగా వర్షం కురుస్తోంది. అల్పపీడన ప్రభావంతో భారీ వర్షం మాచర్ల పట్టణంతో పాటు ఆయా మండలాల్లో కురుస్తూనే ఉంది. చాలా రోజులుగా వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతన్నకు సేదతీరే స్థాయిలో వర్షం కురుస్తూనే ఉంది. మరో వైపున నాగార్జున సాగర్ కుడికాలువ ద్వారా 12 అడుగుల స్థాయి సుమారు 6 వేల క్యూసెక్కుల నీటిని కాలువ నుంచి విడుదల చేస్తున్నారు. రైతులకు పంటలు సాగు చేసుకునేందుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వర్షాలు ఆలస్యంగానైనా ప్రారంభమయ్యాయి. ఎడతెరిపిలేకుండా మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం కనబడుతుంది. సాగు, తాగునీరుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కుడికాలువ ద్వారా నీటి విడుదల వారం రోజులుగా కొనసాగిస్తున్నారు. వర్షాల వల్ల పట్టణంలోని డ్రైయిన్లు, కాలువలు జలమయంగా మారాయి. లోతట్టు ప్రాంతాలు వర్షం నీరు చేరింది.

28న ముస్లింల ర్యాలీ

నరసరావుపేట: మణిపూర్‌లో హింసకు వ్యతిరేకంగా ఈనెల 28వ తేదీ శుక్రవారం పట్టణంలో ముస్లింలు నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ప్రజా, కల సంఘాలు, వామపక్ష నాయకులు ప్రకటించారు. మంగళవారం స్థానిక షాదీ ఖానా మైదానంలో మణిపూర్ బాధితులకు సంఘీభావంగా పట్టణంలోని ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మణిపూర్‌లో ఆదివాసీలు, మహిళలు, గిరిజనులు, క్రిస్టియన్‌లపై జరుగుతున్న హింసాత్మక దాడులను వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. 28వ తేదీన జుమ్మా నవాజ్ అనంతరం మణిపూర్ బాధితులకు మేము సైతం అండగా అంటూ ముస్లింల నిరసన ర్యాలీ చేపట్టడం జరుగుతుందని మత పెద్దలు తెలిపారు.సమావేశంలో కుల,ప్రజా సంఘాల నాయ కులు, వివిధ పార్టీల నాయకులు డి.శివకుమారి, షేక్ మస్తాన్, మౌలాలి, బాసిద్, కరీ ముల్లా, సిలార్, జాన్‌పాల్, బాదుగున్నల శ్రీనివాసరావు, రమాదేవి పాల్గొన్నారు.

రోగులకు పౌష్టికాహారం అందజేత



పండ్లు, బ్రెడ్లు అందజేస్తున్న డీఎండీహెచ్‌వో శోభారాణి, కేపీ రంగారావు, ప్రతినిధులు

నరసరావుపేట: ప్రభుత్వ వైద్యశాలలో వైద్యానికి వచ్చిన బాలింతలు, ఇతర ఆరోగ్య సమస్యలతో వైద్యం కోసం వచ్చిన పేషంట్లకు పౌష్టికాహారం, పండ్లు, బ్రెడ్స్ పంపిణీ చేయడం హర్షించదగ్గ విషయమని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.శోబారాణి పేర్కొన్నారు. మంగళవారం తాళ్ల సుదర్శన్‌రెడ్డి సహకారంతో నరసరావుపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశాలలో పౌష్టికాహారం, పండ్లు, బ్రెడ్స్ పంపిణీ చేశారు. దీనికి ముఖ్య అతిథులుగా రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ కేపీ రంగారావు, డీఎండీహెచ్‌వో డాక్టర్ జి.శోభారాణి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో ప్రభుత్వంతో పాటు, సేవా సంస్థలు, దాతలు కూడా ముందుకు వచ్చి ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించటం మంచి పరిణామమంటూ వారిని అభినందించారు. కేపీ రంగారావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలు నిర్వహించటమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. జిల్లా ఏరియా హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ ఎం.మంత్రూనాయక్, రోటరీ క్లబ్ అధ్యక్షులు కొత్తూరి శ్రీనివాసరావు, సెక్రెటరీ రాజేష్, రోటరీ క్లబ్ డైరెక్టర్లు షేక్ జిలానిమాలిక్, మేళ్ళచెరువు సుమిత్రకుమార్, పాశం కృష్ణారావు, కాకుమాను శ్రీనివాసరావు, కాకుమాను రాఘవరావు, జమ్ముల రాధాకృష్ణ, పాట్టి శశిభూషణ్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి, వైద్యశాల డాక్టర్లు హనుమకుమార్, డాక్టర్ నాగ పద్మజ, పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం

మున్సిపల్ చైర్మన్ డాక్టర్ షేక్ దస్తగిరి



వినుకొండ(నూజెండ్ల): మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు సూచనలు, సలహాల మేరకు పట్టణంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి అన్నారు. స్థానిక మున్సిపాలిటీ కౌన్సిల్ హాల్‌లో కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు పట్టణంలో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో అభివృద్ధి అజెండాలో పొందుపరిచిన 35 అంశాలపై చర్చించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ షేక్ దస్తగిరి వాటిని ఆమోదించారు. 30వ వార్డులో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని కౌన్సిలర్ ఎంఎల్ రెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. 19వ వార్డులో వీధి లైటు లేవని కౌన్సిలర్ బాషా కోరగా మరికొందరు కౌన్సిలర్లు ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సమావేశం దృష్టికి తీసుకురాగా సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని చైర్మన్ తెలిపారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గుడ్ విల్ పద్ధతిపై నిర్మాణం చేపట్టబోయే కమర్షియల్ కాంప్లెక్స్‌ను జీవో నెంబరు 146 ప్రకారం అమలు పరచాలని సమావేశం దృష్టికి తీసుకొచ్చిన టీడీపీ కౌన్సిలర్లు చైర్మన్‌కు వినతిపత్రం అందించి సమావేశం నుంచి వాకౌట్ అయ్యారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి



మృతుడు పరిశుద్ధరావు

నాదెండ్ల: జాతీయ రహదారిపై అడ్డు వచ్చిన కుక్కను తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడికి తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎస్సై జె.బలరామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం గ్రామానికి చెందిన నేలటూరి పరిశుద్ధరావు (25) ముఠా పనులు చేసుకుని జీవిస్తుంటాడు. ఈ నెల 23న తన మిత్రుడు రమేష్‌తో కలిసి ద్విచక్రవాహనంపై యద్దనపూడిలోని తన సోదరి నివాసానికి వెళ్ళాడు. తిరిగి రాత్రి 10.30 గంటల సమయంలో తుమ్మలపాలెం వెళ్తుండగా ఏఎంజీ చెక్‌పోస్టు వద్దకు వచ్చేసరికి వాహనానికి కుక్క అడ్డుగా రావటంతో తప్పించే క్రమంలో అదుపుతప్పి పడ్డారు.

దీంతో తీవ్ర గాయాలైన పరిశుద్ధరావు, రమేష్‌లను 108 సాయంతో చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం పరిశుద్ధరావును గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా వైద్యం పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. పరిశుద్ధరావు సోదరి మాదాసు ప్రవల్లిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన పద్యపోటీలు

వినుకొండ(నూజెండ్ల): మహాకవి, కవికోకిల గుర్రం జాషువా 52వ వర్ధంతి కార్యక్రమం సంద ర్భంగా జాషువా సాంస్కృతిక సమాఖ్య సౌజన్యంతో జీవనజ్యోతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి రాష్ట్ర స్థాయి రంగస్థలం, పౌరాణిక పద్యపోటీలు ముగిశాయి. పద్యపోటీల్లో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు పాల్గొని మాట్లాడుతూ కుల వివక్ష, పేదరికాలను తన గురువులుగా భావించి చీత్కా రాలు, అవమానాలు ఎదుర్కొన్న చోటే సన్మా నాలు పొందడం అది ఒక్క మహాకవి గుర్రం జాషువా వలనే సాధ్యమైందన్నారు. అటువంటి మహోన్నత వ్యక్తి మన వినుకొండ వాసి అవడం నిజంగా మనం చేసుకున్న అదృష్టమన్నారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి నీలం వెంకటేశ్వర్లు (అచ్చంపేట), ద్వితీయ బహుమతి మురికిపూడి రత్నకుమార్ (గోపువారిపాలెం), తృతీయ బహుమతి లాలునాయక్ (చిలకలూరిపేట)లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వెంకట్రావు, సభ్యులు, జాషువా సాంస్కృతిక సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.